




ఆంధ్రదేశంలోని అమ్మకు అమెరికా అమ్మాయి నెలకో ఉత్తరం

కల్పనా రెంటాల

## ప్రియమైన అమ్మకు!

రజనికి అమెరికా సంబంధం కుదిరిందన్న శుభవార్తతో నువ్వు రాసిన ఉత్తరం చదివి నాకు సంతోషంతో పాటు కాస్త దిగులేసింది కూడా. రజనికి పెళ్ళి కుదరటం సంతోషమే అయినా అది అమెరికా సంబంధం కావడం నా దిగులుకు కారణమంటే నువ్వు ఆశ్చర్యపోకు. అమెరికా సంబంధం అంటే ఎగిరిగంతెయ్యాలి కానీ దిగులేమిటి అంటున్నావా?

ఎందుకంటే... అమెరికా పెళ్ళిళ్ళన్నీభూతలస్వర్గం అనుకోవడం ఒట్ఠి భ్రమ మాత్రమే అంటే నమ్మాలి నువ్వు..

రజని డిగ్రీ చేసి, ఎం.బి.ఎ చదవాలనుకుంటోందనీ..ఈ లోగానే ఈ సంబంధం కుదిరిందనీ, తనకి కాబోయే భర్త ఇక్కడ హెచ్1 వీసామీద పనిచేస్తున్నారనీ రాశావు కదూ...!? అంటే రజని ఇక్కడికి హెచ్4 వీసా మీద వస్తోందన్నమాట..అంటే డిపెండెంట్ వీసా..!ఇలాంటి వీసా మీద వచ్చేవాళ్ళు నిజంగా ‘డిపెండెంట్‘ గానే ఉండాలి..అంటే ఒకరిమీద ఆధారపడి బతకాల్సిందే. వాళ్ళు సాధారణ గృహిణిగా బతకాల్సిందే తప్ప, ఉద్యోగం చేయడానికి వీలులేదు..కొన్ని రాష్ట్రాల్లో డ్రైవింగ్ లైసెన్స్ కి కూడా అర్హత ఉండదు.. వీళ్ళకు సోషల్ సెక్యూరిటీ నెంబర్లు ఉండవు, వర్క్‌పర్మిట్లు ఉండవు.

ఇదంతా గోరంతలు కొండంతలు చేసి చూపించడం కాదు. అక్షరాలా అలాంటి వీసాల మీద వచ్చిన వాళ్ళ పరిస్థితి అలాగే ఉంటుంది. ఇదొక జీవిత విధానం. ఇది అర్థమవటానికి, అలవాటు పడటానికి చాలా టైం పడుతుంది. అలవాటు పడటం అంటే ఇక్కడ సుఖాలకు కాదు, ఇక్కడి ఇబ్బందులకీ, పరిధులకీ, పరిమితులకీ.!

చాలా మంది మగవాళ్ళు తామెంతో కష్టపడితేనే కానీ అమెరికా రాలేకపోతున్నామని, అదే ఆడ వాళ్ళైయితే హాయిగా పెళ్ళిళ్ళుచేసుకుని భర్తలతోపాటు విమానాలు ఎక్కేసి బోలెడంత బాధపడిపోతుంటారు. నిజానికి వాళ్ళు పడే కష్టం అమెరికా వీసా సంపాదించడం వరకూ, లేదా ఇక్కడ ఉద్యోగాలు వెతుక్కుని అందులో నిలదొక్కుకోవడానికో పరిమితమై ఉంటుంది. అదే పాపం పూర్ గాళ్స్ మొగుడ్ని కొనుక్కుని అహాహా అమెరికా అంటూ ఇక్కడకు వచ్చాక కానీ ఇక్కడ పరిస్థితులు అర్థంకావు. ప్రతి పనికీ ఆర్థికంగానే కాకుండా

ఎమోషనల్‌గా  కూడా భర్త మీద ఆధారపడి రావటం ..!!

ఈ చిన్న ఉదాహరణ చెప్తా విను..

మొన్నొక స్నేహితురాలింటికివెళ్ళాను..అవును మరిచి పోయేను..ఇందిర నీకు తెలుసు కదా, ఎం.బి.ఎ చేసి ఇక్కడికి హెచ్4 వీసా మీద వచ్చింది...తన వద్దకి వెళ్ళాను. ఏదేనా ఉద్యోగం దొరక్కపోతుందా అనే  ఆశతో ఇన్నాళ్ళూ ప్రయత్నించింది..కానీ ఏమీ దొరకలేదు..ఇద్దరు అమెరికన్ సిటిజన్స్ కి మాత్రం తల్లి కాగలిగింది.. వాళ్ళాయన ఉద్యోగం చేసే ఊరు వేరు, ఇందిర ఉండేది ఇక్కడ..లంకంత ఇంట్లో  ఇద్దరు పిల్లల్ని పెట్టుకుని ఇందిర ఒక్కర్తే అన్నీ సర్దుకుంటుంది.. అతను వీకెండ్‌కి వచ్చి వెళ్తుంటాడు.. నిజంగా ఇందిర మానసికంగా ఎంత కుంగి పోతూ ఉంటుందో తెలుసా..!? డాక్టర్లేమో డిప్రెషన్ అని చెప్తారు..కష్ట సుఖాలు చెప్పుకోడానికి కూతవేటు దూరంలో మన వాళ్ళెవరూ లేకపోతే  ఎంత నరకంగా ఉంటుందో అది అనుభవించే వాళ్ళకే తెలుస్తుంది..

పైకి చెప్పుకోలేక ఇలాంటి ఇందిరలు ఎంతమంది బాధలు పడుతున్నారో కదా...! చెప్పొచ్చేదేమిటంటే.అమెరికా అంటే కేవలం సుఖాల సీమ మాత్రమే కాదు. ఇలాంటి ప్రతికూల పరిస్థితులు కూడ తారసపడవచ్చుననే విషయాన్ని  ఆడపిల్లలూ, వాళ్ళ తల్లిదండ్రులూ కూడా ముందే తెలుసుకుని అందుకు సిద్ధపడితే.. తరువాత విచారించవలసిన అవసరం తగ్గుతుంది..!

మిగతా విషయాలు మరో ఉత్తరంలో రాస్తాన్లే..

నీ
చిన్నీ.